
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
ఆదివారం 21 సెప్టెంబరు 2025





పండుగ శోభ

- ఆలయంలో ప్రారంభమైన బతుకమ్మ ఆటలు
- ధర్మగుండంలో నిమజ్జనం
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

7లో

◄ విద్యుత్ దీపాలతో రాజన్న ఆలయం

ఒక్కేసి..పువ్వేసి చందమామ..

- నేటి నుంచి ఎంగిలి పూల బతుకమ్మ
- సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 30న పెద్ద బతుకమ్మ
- వేములవాడలో 27, రుద్రంగిలో అక్టోబర్ 4న సంబురాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఆడపడుచుల చిరునవ్వుల మధ్య మారుమోగే చప్పట్లు.. వినసొంపుగా గౌరమ్మ ఆట పాటలతో ఆది వారం బతుకమ్మ పండుగ మొదలు కాబోతుంది. తొమ్మిదిరోజుల పాటు సాగేపూల జాతరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మహిళలు అట్టహాసంగా జరుపుకోవడానికి సన్నద్ధమయ్యారు. బతుకమ్మ సంబరాలతో ప్రతిపల్లె ఆటపాటలతో పులకరించి పోనుంది. బతుకమ్మ అనగానే ప్రకృతి కూడా పుకలరిస్తుంది. ఆడపడుచులు పుట్టిం టికి వచ్చి సందడి చేసే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక. సిరిసిల్ల పల్లెలు, పట్టణ వాకిళ్ల పూల తోటగా మారిపోయేవేళ... జిల్లా వ్యాప్తంగా మహిళల శ్రమజీవన సంస్కృతికి అద్దం పడుతూ మహాలయ అమవాస్య నుంచి చిన్న బతుకమ్మలతో సంబరాలు మొదలై పెద్ద బతుకమ్మతో ముగుస్తాయి. సద్దుల (పెద్ద) బతుకమ్మను సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఈనెల30న అంగరంగ వైభవంగా జరుపుకోను న్నారు. వేములవాడలో 27న, రుద్రంగిలో అక్టోబర్ 4న పెద్ద బతుకమ్మ సంబరాలు జరుపుకుంటారు. మున్సిపాలి టీలు, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగలకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు.





బతుకమ్మ అడుతున్న మహిళలు (ఫైల్)



బతుకమ్మతో యువతి

● ఆడపడుచులు ఎదురుచూసే సంబరం

బతుకమ్మ పండుగ కుటుంబాన్ని ఆనందోత్సాహాల్లో ముంచుతుంది. తొమ్మిది రోజుల పాటు ఆట పాటలతో సాగిపోయి దసరాకు రెండు రోజుల ముందు సద్దుల బతుకమ్మతో ముగిసే పండుగ కోసం ఆడ పడుచు లందరూ ఎదురు చూస్తారు.

● ప్రకృతి పులకించే పండుగ

బతుకమ్మ పండుగ అంటే ప్రకృతి కూడా పుకలరిస్తుంది. ఆడపడుచులు పుట్టింటికి వచ్చి సందడి చేసే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోంది. బతుకమ్మ పండుగ రోజులు పల్లెబాటలకు ఇరు వైపులా.. పసుపు పారబోసినట్లుగా తంగేడు.. ఏ దిక్కున చూసినా పలక రించే కట్ల పూలు, ప్రతి ఇంటి గడప ముందు కనిపించే మందారాలు, తలుపు సందుల్లో తొంగి చూసే గన్నేరు.. నేలంతా పరుచుకునే గుమ్మడి ఇలా.. తీరొక్క రంగుల పూలతో పడుచుల్లో ఆనందాన్ని నింపు తాయి. బతుకమ్మను ఆదిశక్తిగా పల్లెపల్లెలో ఏ తారతమ్యాలు లేకుండా ఆడపడు చులు జరుపుకుంటూనే ఉంటారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్ద బతుకమ్మను మహిళలు జరుపుకుంటే.. అందుకు ఐదు రోజుల ముందు పిల్లలు బొడ్డెమ్మ పండుగను జరుపుకుంటారు. చిన్నపిల్లలు, కన్నెపిల్లలు కలిసి ఒక పీటపైన ఎర్రమట్టితో అంతస్తులుగా, గుండ్రంగా బొడ్డెమ్మను తయారు చేస్తారు. ప్రతి రోజు సాయంత్రం అలంకరించి.. దూపదీప నైవేద్యాతో అర్చిస్తూ... బొడ్డెమ్మ చుట్టూ తిరుగుతూ కోలాటం ఆడుతారు. బొడ్డెమ్మ పాటల్లో చందమామను కలుపుతూ... పాడుకోవడం ప్రధానంగా కనిపిస్తుంది. బొడ్డెమ్మ తరువాత వచ్చే అమవాస్య నుంచి మహిళలు బతుకమ్మ సంబరాలను ప్రారంభిస్తారు. మగవారంతా తంగేడు, గునుగు పూలను పచ్చిక బయల్లలోంచి సేకరించి తీసుకొస్తారు. ఇంటిల్లి పాది ఎంతో ఉత్సాహంగా బతుకమ్మను పేరుస్తారు. ఇలా చివరి రోజున పెద్ద బతుకమ్మ పేర్చి కొత్త బట్టలు ధరించి...

మిగతా 8లో

● బతుకమ్మ పేర్చు కళ

తెలంగాణ వాకిళ్లను పూలతోటగా మార్చిన బతుకమ్మ సంబరాల్లో పెద్ద బతుకమ్మకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. పెద్ద బతుకమ్మ మగవాళ్ల సహ కారంతో పేరుస్తారు. మగవాళ్లు అందరూ పెద్ద బతుకమ్మ ముస్తాబుకు అవసరమైన రంగులు, పూల సేకరణలో మునిగిపోతారు. సామాజిక సహ జీవన సౌందర్యానికి ప్రతీకగా నిలిచే పెద్ద బతుకమ్మను పేరవడంలోనూ ఒక కళ ఉంటుంది. ముత్తయిదువలు పసుపు, కుంకుమలు వేసి కూడా తాంబాల మొదటి వరుసలో తంగేడు పువ్వు పేరుస్తారు. ఆ తరువాత గునుగు పువ్వులను రంగుల్లో ముంచుతూ పేరుస్తారు. మళ్లీ చివరగా గడ్డి పువ్వులు, చిట్టి చామంతి, పట్టుకుచ్చులపువ్వు, పూతబంతితో అందంగా పేర్చి సాయంత్రం పట్టుచీరలతో అందంగా తయారైన పడుచులు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ ఆటపాటలతో బతుకమ్మకు వీడ్కోలు పలుకుతారు.

బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

● కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మను రాష్ట్ర ఉత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో, అన్ని గ్రామ పంచాయతీలు, పట్టణాల్లో సెప్టెంబర్ 21 నుండి 30 వరకు ప్రత్యేకంగా ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా భాగస్వామ్యంతో మహిళా శక్తిని మరింతగా ప్రతిబింబించేలా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించాలని, గ్రామస్థాయి నుంచి మండల, పట్టణ స్థాయిలోని అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని అన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలోని చెరువులను పరిశుభ్రంగా ఉంచి, సరైన వెలుగులు, పోలీస్ భద్రత వంటి ఏర్పాట్లు చేయాలని, మహిళా సమూహాలు ప్రత్యేకంగా పాలుపంచుకొని ఉత్సవాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అన్ని వర్గాల మహిళల ప్రాతినిధ్యంతో సెప్టెంబర్ 30న జిల్లాలో గ్రాండ్ ఫినాలే సద్దుల బతుకమ్మను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సన్నద్ధం కావాలని, వెలుగుల అలంకరణ, సౌండ్ సిస్టమ్, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. సమాచార మాధ్యమాల ద్వారా బతుకమ్మ ఉత్సవాల ప్రచార కార్యక్రమాలు చేపట్టి, ప్రతి ఊరులోని ప్రజలు విశేషంగా పాల్గొనాలని సూచించారు

ఎస్ఐఆర్ పనులు పకడ్బందీగా పూర్తి చేయాలి

సిరిసిల్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు సెప్టెంబర్ 23లోపు సన్నద్ధత పనులు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ఎస్ఐఆర్ నిర్వహణ కంటే ముందు ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో2002 ఎస్ఐఆర్ డేటాను 2025 ఎస్ఎస్ఆర్ డేటాతో కంపేర్ చేసుకోవాలని ఈ రెండు జాబితాలో కామన్‌గా ఉన్న పేర్లు మినహాయించి 2002 తర్వాత ఓటరుగా నమోదైన వారి వివరాలను క్షేత్ర స్థాయిలో మరోసారి ధ్రువీకరించాల్సి ఉంటుందని అన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రొఫార్మా ప్రకారం ఎస్ఐఆర్ సన్నద్ధత రిపోర్టు తయారు చేయాలని, ఎస్ఐఆర్ సంబంధించి సెప్టెంబర్ 2023 నాటికి పూర్తి చేయాలని అన్నారు.

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధిలో భాగస్వాములు కండి

● ప్రభుత్వ విప్ ఆధ్వర్యంలో శృంగేరి వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేత ● ప్రభుత్వ విప్‌కు ఆశీస్సులు అందించిన భారతి తీర్థ మహాస్వామి



శృంగేరి పీఠాధిపతికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఆది శ్రీనివాస్, ఈవో



జగద్గురు భారతి తీర్థ మహాస్వామి ఆశీస్సులు తీసుకుంటున్న విప్

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి క్షేత్ర విస్తరణ అభివృద్ధిలో భాగంగా ఆలయాన్ని సందర్శించాల్సిందిగా శృంగేరి జగద్గురు భారతి తీర్థ మహాస్వామి, పీఠాధిపతి విధుశేఖర భారతి స్వామివారలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. విజయయాత్రలో భాగంగా శ్రీ స్వామి వారు తెలంగాణ రాష్ట్ర పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆలయంలో జరుగుతున్న పనుల తీరుతెన్నులు, ప్రగతిని పరిశీలించాల్సిందిగా వారిని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణపై పలు మార్లు శృంగేరి పీఠాధిపతులను కలిసి వారి సూచనలు, సలహాల మేరకు పనులను ప్రారంభించామని తెలిపారు. రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పురోగతిపై స్వామి వారలకు వివరించినట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయ బృందంతో కలిసి శ్రీ శారద అమ్మవారిని దర్శించుకుని తుంగభద్ర నదిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శృంగేరి వెళ్లిన వారిలో రాజన్న ఆలయ ఈవో రమాదేవి, ఆలయ ఇన్‌చార్జి స్థానాచార్యులు నమిలికొండ ఉమేష్‌శర్మ ఉన్నారు.

ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక





నాయిన్ దినకర్ రాపెల్లి శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ కరీంనగర్ డివిజన్ నాయకులు వి వామన్‌రావు, ఏ రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో జీవిత బీమా సంస్థ సిరిసిల్ల శాఖ ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాయిని దినకర్, కార్యదర్శి రాపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బజార్ శ్రీకాంత్, సహాయ కార్యదర్శులు పీ మల్లేశం, గంప ప్రణీత్, కోశాధికారి ఎం శివాణి, ఈసీ మెంబర్స్ ఎస్ కిరణ్, ఆర్ సాయి, చంద్రప్రకాష్, వీ కావ్య, పీ భూమయ్య, జీసీఎం గాజుల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. నిరంతర పోరాటాలతో హెల్త్ పాలసీల మీద జీఎస్టీని కేంద్రప్రభుత్వం రద్దు చేసిందని వామన్‌రావు పేర్కొన్నారు.

కుక్కలు, కోతుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి మూషం రమేష్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్

సిరిసిల్లటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో కుక్కలు, కోతుల నుండి ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు రక్షణకల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మూషం రమేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అమృతలాల్ శుక్ల కార్మిక భవనంలో విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో కుక్కలు, కోతులు విపరీతంగా పెరిగిపోతున్నాయని అన్నారు. వీధిరోడ్లలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ పాదచారులు, ద్విచక్రవాహన దారులను గాయపరుస్తున్నాయని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యులు కోడం రమణ, జిందం కమలాకర్ పాల్గొన్నారు.

'కుసుమ' కుటుంబ సభ్యులకు సన్మానం



డాక్టర్ కుసుమ విఠల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం శివనగర్‌లోని కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధికి అన్ని రకాలకుగా సహాయ సహకారాలు అందిస్తున్న కుసుమ కుటుంబ సభ్యులు డాక్టర్ కుసుమ విఠల్ కుసుమ శ్రీధర్‌ను శనివారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాల వేదికపైన రేకుల షెడ్డు నిర్మాణం పనులకు విఠల్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కుసుమ విఠల్ మాట్లాడుతూ పాఠశాలలు దేవాలయాలతో సమానం అన్నారు. విద్యార్థులు ప్రశ్నించే జ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోతిలాల్ మాట్లాడుతూ కుసుమ రామయ్య కుమారులు విఠల్, మల్లేశం, శ్రీధర్ పాఠశాలకు ఎంతో సహాయ సహకారాలను అందిస్తున్నారని అన్నారు. పాఠశాల ఆవరణలోని వేదికపై రేకుల షెడ్డు నిర్మాణానికి సహాయం అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలి పారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మరిపెద్ది ఉమ, మాజీ కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ కోచింగ్ తరగతులను ప్రారంభించాలి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ స్టడీ స్కరిల్ కోచింగ్ తరగతరులను పునఃప్రారంభించాలని శనివారం భీం ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దోచ్చల ప్రవీన్‌కుమార్ ఎస్సీ డెవలప్‌మెంట్ జిల్లా అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రవీన్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ స్టడీ సర్కిల్‌ను గత నోటిఫికేషన్స్‌కు ముందు తరగతులను ప్రారంభించి నిలిపివేయడం జరిగిందన్నారు. పేద నిరుద్యోగ యువత, విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని రానున్న నోటికేషన్స్‌కు ముందే కోచింగ్ తరగతులను పునఃప్రారంభించాలని ఎస్సీ డెవలప్‌మెంట్ జిల్లా అధికారికి వినతిపత్రం అందించడం జరిగిందన్నారు.

వికలాంగుల పింఛన్ పెంచాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వికలాంగులకు ఇచ్చే పింఛన్ మొత్తాన్ని పెంచాలని పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందించారు. మండలంలోని ఇల్లంతకుంట, వెంకట్రావుపల్లె, సోమారంపేట, ముస్కానిపేట, గాలిపెల్లి, గొల్లపల్లి, వల్లంపట్ల గ్రామాలలో శనివారం పంచాయతీ కార్యదర్శులను కలిసి సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగుల పింఛన్ రూ 6వేలు, ఆసరా పింఛన్ రూ 4వేలు, తీవ్రవైకల్యం ఉన్నవారికి రూ. 15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్ఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి గుండ్రెడ్డి రాజు, ఎమ్మార్పీఎస్ జిల్లాకోకన్వీనర్ సావనపెల్లి రాకేష్, మండలశాఖ అధ్యక్షుడు మంద రాజు, నాయకులు లక్ష్మారెడ్డి, కాసుపాక సురేష్, దేవేందర్, రాజయ్య, రాయమల్లు, శంకర్, రాజు, రాజలింగం ఉన్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సత్వరమే సిద్ధం చేయాలి



తాళ్లపెల్లిలో రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

ఇల్లంతకుంట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సత్వరమే సిద్ధం చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులకు సూచించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి శనివారం చెడిపోయిన రోడ్లు, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లంతకుంట బస్టాండ్ వద్ద కమ్యూనిటీ టాయిలెట్లను త్వరలో నిర్మిస్తామని పేర్కొన్నారు. అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్ళను ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సిరికొండ గ్రామంలో అసైన్డ్ భూమిలో 45మంది ఎస్సీలకు నివేశ స్థలాలు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరగా కలెక్టర్ అంగీకరించారు. కార్యక్రమంలో ఈఈ సుదర్శన్‌రెడ్డి, గృహనిర్మాణ పీడీ శంకర్, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ శశికళ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్యయాదవ్, నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, పసుల వెంకటి, ప్రసాద్, కొలపురి అంతగిరి, మామిడి రాజు, ఎలుక రామస్వామి, తీగల పుష్పలత, రజనీకాంత్, వీరేశం, వెంకటరెడ్డి, జ్యోతి, నేరెళ్ళ విజయ్‌గౌడ్, అమర్ పాల్గొన్నారు.

మండలంలోని తాళ్లపెల్లి గ్రామసమీపంలోని రోడ్డు పూర్తిగా చెడిపోగా పరిశీలించడానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎమ్మెల్యే సత్యనారాయణలు ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేశారు.

కల్వకుంట్ల కుటుంబం మహిళలను గౌరవించడం నేర్చుకోవాలి

- జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు వనితనళినీకాంత్

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కన్న బిడ్డను, తోడ బుట్టిన చెల్లిని పార్టీ నుంచి సస్పెండ్ చేసిన కల్వకుంట్ల కుటుంబం ముందుగా మహిళలను గౌరవించడం నేర్చుకోవాలని జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు కామని వనితనళినీకాంత్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో విలేకరు సమావేశంలో వనిత మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికా రంలో ఉన్న మొదటి ఐదు సంవత్సరాలలో ఏ ఒక్క మహిళకు కేబినెట్‌లో అవకాశం ఇవ్వలేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతి మహిళకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ఇంద్ర మహిళా శక్తి ద్వారా డ్వాక్రా గ్రూప్‌లలో ఉన్న మహిళలందరికి రెండు చీరలు ఇవ్వడం జరుగుతుంద న్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి : డీఐఈవో



మాట్లాడుతున్న డీఐఈవో శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మొదటి సంవత్సరం విద్యార్థుల స్వాగతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఐ శ్రీనివాస్‌తో పాటు డీఐఈవో శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఐఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ సర్కారు విద్యాలయాల్లో చదువుకున్న వారు ప్రస్తుతం మంచి స్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు. సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. అనంతరం విద్యార్థులు ఆటాపాటలతో ఉర్రుతలూగించారు. అత్యధిక మా ర్కులు సాధించిన విద్యార్థులు రిహాన్, నిహారిక, రాణి, స్పందన, అక్షర, ధనలక్ష్మిలకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు సత్యనారాయణ, పర్శ రాములు,జయవర్ధన్, చంద్రమౌళి,విష్ణుప్రసాద్, రవిచంద్రు, గంగాధర్, శ్రీనివాస్, భూమక్క, కవిత పాల్గొన్నారు.

గాలిలో కలిసిన గల్ఫ్ ఆశలు

● ఇంటర్వ్యూకు వెళ్లివస్తూ యువకుడి హఠాన్మరణం


ప్రశాంత్(ఫైల్)

గంభీరావుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం గోరంటాలకు చెందిన ప్రశాంత్(28) గల్ఫ్‌దేశాలకు వెళ్లేప్రయత్నంలో హఠాన్మరణం చెందడం కలిచివేసింది. బతుకు దెరువు కోసం దుబాయి వెళ్లేందుకు ప్రశాంత్ సిద్ధమయ్యాడు. దుబాయి వెళ్లేక్రమంలో ఆ కంపెనీ వారు జగిత్యాలలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూలో ప్రశాంత్ పాల్గొన్నారు. తిరిగి జగిత్యాలనుంచి గోరంటాలకు వస్తుండగా, ప్రశాంత్ ఛాతీలో నొప్పివచ్చి గుండెపోటుకు గురయ్యాడు. హుటాహుటిన ప్రశాంత్‌ను కరీంనగర్‌కు చికిత్స కోసంతరలించారు. ప్రశాంత్అప్పటికే చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. ప్రశాంత్‌కు భార్య, ఏడాదిన్నర కొడుకు ఉన్నారు. మృతుడు ఎమ్మార్పీఎస్ గ్రామశాఖ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బరుకుటం తిరుపతి, ప్రధానకార్యదర్శి శనిగరం నరేశ్వర్మ, స్వామి, శంకర్, రాజు, అనిల్, మల్లేష్ తదితరులు ప్రశాంత్ కుటుంబాన్ని పరామర్శించారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ ప్రాంతంలో శనివారం రాత్రి పోలీస్ అధికారులు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదుచేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. టౌన్ఎస్సై రవికిరణ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా భీమారం మండల కేంద్రానికి చెందిన లింగాల దీపక్, లకుమల్ల కార్తీక్ అనే ఇద్దరువ్యక్తులు కారును అతివేగంగా నడుపుతూ పోలీసులపైకి దూసుకువచ్చారు. వారికి డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు చేసే క్రమంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తూ దురుసుగా ప్రవర్తించారు. టౌన్‌పోలీస్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ పేర్కొన్నారు.

మల్యాల ఎస్సైపై ఫిర్యాదు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మల్యాల ఎస్సై నరేష్ కుమార్‌పై కఠినచర్యలు తీసుకోవాలని చొప్పదండి మాజీఎమ్మెల్యే రవి శంకర్ శనివారం ఎస్పీ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశాడు. గంగాధర మండలం హిమ్మత్‌రావు గ్రామానికి చెందిన బండారిశ్రీనివాస్ అనే యువకుడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేసినందుకుగాను ఎస్సై పోలీస్ స్టేషన్‌కు యువకుడిని తీసుకవచ్చి చిత్రహింసలకు గురి చేసినట్లు మాజీఎమ్మెల్యే ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా అట్రాసిటీ కేసు నమోదు చేశారని వివరించారు. రవి శంకర్ వెంట మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, బీఆర్ఎస్ నాయకులు ఐల్నేని సాగర్ రావు, కోరుకంటి రాము తదితరులు ఉన్నారు.



గుట్టుగా గుడుంబా

- రహస్య ప్రాంతాల్లో తయారీ
- పల్లెల నుంచి పట్టణాలకు రవాణా

ఎల్లారెడ్డిపేట/ వీర్నపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని మారుమూల పల్లెల్లో గుడుంబా మళ్లీ గుప్పుమంటోంది. దసరా పండుగతో పెద్ద ఎత్తున సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఏ గ్రామంలో చూసినా గుట్టుగా గుడుంబా తయారవుతోంది. గుడుంబాను కట్టడి చేసేందుకు ఆబ్కారీ అధికారులు, పోలీసులు తనిఖీలు ముమ్మరం చేస్తున్నా దందా నడుస్తూనే ఉంది. మద్యం కంటే సారా తక్కువ ధరలకు లభిస్తుండడంతో దినసరి కూలీలు ఎక్కువగా వాడుతున్నారు. రహస్య ప్రాంతాల్లో పగలు, రాత్రంతా సారా తయారు చేస్తున్నారు.

● పెద్ద ఎత్తున బెల్లం, పటిక కొనుగోళ్లు

ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని అక్కపల్లి, బుగ్గరాజేశ్వరతండా, దేవునిగుట్టతండా, కిష్టునాయక్ తండా, గుండారం, మద్దిమల్ల, బంజేరు, లొద్దితండా తదితర గిరిజన తండాల్లోని పలువురు రానున్న దసరా పండుగను దృష్టిలో పెట్టుకుని కామారెడ్డి, సిరికొండ, నిజామాబాద్, మాచారెడ్డి, రాచర్లగొల్లపల్లి తదితర పట్టణాల నుంచి సారా ముడి సరుకులైన బెల్లం, పటికను కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు చిన్నపాటి సంచుల్లో నింపుకుని మహిళలు ఆర్టీసీ బస్సుల్లో తరలిస్తున్నారు. తండాల్లోని శివారు ప్రాంతాల్లో గుడుంబా తయారు చేస్తున్నారు. రహస్య ప్రాంతాల్లో బెల్లం పానకం, ఇప్పపువ్వు పులియ బెట్టి నిల్వ చేస్తున్నారు. వాటి నుంచి బట్టీల ద్వారా సారాను తయారు చేస్తున్నారు. నిత్యం ఆయా గ్రామాల్లో వందల లీటర్ల సారా తయారవుతోంది. అధికారులు దాడులు జరిపి కేసులు నమోదు చేసినా గుడుంబా తయారీ మాత్రం ఆగడం లేదు.

● పట్టణాలకు రవాణా

తండాల్లో తయారవుతున్న సారాను గ్రామాలు, పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంతో పాటు కామారెడ్డి, సిద్దిపేట, కరీంనగర్, నిజామాబాద్ పట్టణాలు, పల్లెలకు తరలించి వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. స్థానికంగా అమ్మకాలు సాగిస్తున్నారు. లీటరుకు రూ. 100 చొప్పున విక్రయిస్తున్నారు. తక్కువ ధరకు లభిస్తుండడంతో దినసరి కూలీలు సారాకు ఎగబడుతున్నారు.


బట్టీపై తయారు చేస్తున్న సారా

● దాడులు చేసినా.. ఆగని దందా

మండలాల్లోని పలు గిరిజన తండాల్లో ఎక్సైజ్ అధికారులు, పోలీసులు వరుస దాడులు చేసినా సారా దందా ఆగడం లేదు. ఇటీవల అల్మాస్‌పూర్, కిష్టునాయక్‌తండా, మద్దిమల్ల, భూక్య తండా, గర్జనపల్లి తదితర గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. పక్షం రోజుల్లో 4వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. 4 క్వింటాళ్ల ఇప్పపూవు, 200 లీటర్ల సారా, 20 కిలోల పటికను స్వాధీన పర్చుకున్నారు. 16 మందిపై కేసు నమోదు చేయడంతో పాటు 10 మందిని బైండోవర్ చేశారు.

ప్రత్యేక తనిఖీలను ముమ్మరం చేస్తాం

- శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ, ఎల్లారెడ్డిపేట



ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, కోనరావుపేట, ముస్తాబాద్ మండలాల్లోని గిరిజన తండాల్లో తనిఖీలను ముమ్మరం చేస్తాం. దసరా పండుగ నేపథ్యంలో దాడులను నిర్వహించి సారా తయారీని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. బెల్లం అమ్మకాలు సాగిస్తున్న కిరాణ దుకాణాల్లో సోదాలు నిర్వహిస్తాం. కేసులు నమోదు చేయడంతో పాటు తయారీదారులు, విక్రేతలకు అవగాహన కల్పిస్తాం.

పాము కాటు.. ఆసుపత్రికి తరలింపు

జూలపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్ గ్రామానికి చెందిన అట్ల ఓదెలు అనే వ్యక్తి శనివారం ఉదయం ఇంటి ఆవరణలో ఉన్న పైపులను తీస్తుండగా చేతిపై పాము కాటు వేసింది. దీంతో ఓదెలు అపస్మారక స్థితికి చేరుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు వైద్యం కోసం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం ఓదెలు ఆరోగ్యం మెరుగైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

ఇల్లందకుంట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్లో శనివారం మిస్సింగ్ కేసు నమోదైనట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బూజునూర్ గ్రామానికి చెందిన కనకం అంకుష్ ఈనెల17న హైదరాబాద్‌లోని బంధువుల సంవత్సరీకానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో అంకుష్ భార్య రజిత బంధువుల ఇళ్లలో వాకబు చేసింది. అయినా ఎలాంటి ఫలితం లేదు. ఈ మేరకు రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కారును ఢీకొన్న ట్రక్కు

మల్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మల్యాల అంగడిబజారు ప్రాంతంలో శనివారం ఆగిఉన్న కారును సిమెంట్, కాంక్రిట్ మిక్సర్ ట్రక్కు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం దెబ్బతినగా ఢీకొన్న సమయంలో కారులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఘర్షణలో అడ్డువెళ్లిన వ్యక్తికి కత్తిపోట్లు

కోల్‌సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని కృష్ణనగర్‌లో శనివారం సాయంత్రం సొల్లు కుమారస్వామి అనే వ్యక్తి కత్తిపోట్లకు గురయ్యాడు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న మీనుగు వేణు, ఫొటోగ్రాఫర్ భాస్కర్ మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. శనివారం వేణు మద్యం మత్తులో భాస్కర్ ఇంటికి వచ్చి గొడవ పడుతుండగా భాస్కర్ తోడల్లుడు కుమారస్వామి వారించాడు. భాస్కర్‌కు మద్దతు ఇస్తున్నాడనే కోపంతో వేణు కుమారస్వామిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘర్షణలో వేణుపై భాస్కర్ రాయితో దాడి చేయడంతో అతని తలకు గాయమైంది. గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి క్షతగాత్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుమారస్వామి ఆర్ఎఫ్‌సీఎల్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు.


కత్తిపోటుకు గురైన కుమారస్వామి

దారుణ హత్యకు గురైన మాజీ కౌన్సిలర్

సిరిసిల్ల క్రైం, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ అర్బన్ మండలం పరిధిలోని నాంపల్లి నందికమాన్ ప్రాంతంలో మాజీ కౌన్సిలర్, రియల్ ఎస్టేట్ వ్యాపారి సిరిగిరి రమేష్(54) దారుణ హత్యకు గురైన ఘటన శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. రమేష్‌కు సన్నిహితంగా ఉండే వ్యక్తులే హత్య చేసినట్లు తెలుస్తోంది. ఈ హత్యకు పాల్పడినవ్యక్తి పోలీసులకు లొంగిపోయినట్లు తెలిసింది. సిరిసిల్ల పట్టణం అంబేద్కర్‌నగర్‌కు చెందిన రమేష్‌ను పథకం ప్రకారం శుక్రవారం వెంచర్‌కు పిలిచి హత్య చేసినట్లు తెలుస్తోంది. ఉదయమే ఇంటి నుంచి వెళ్లిన రమేష్‌కు భార్య అనీల సాయంత్రం 3గంటలకు ఫోన్‌చేస్తే స్విచ్ఆఫ్ వచ్చినట్లు తెలిపింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ హత్యకు భూ వివాదాలే కారణమని పోలీసులు తేల్చారు. రమేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 25ఏళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఇతని భూములపై తరచూ వివాదాలు ఉండడం వల్ల పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి తెలిపారు. హత్యకు గల పూర్తి కారణాలను త్వరలోనే వెల్లడిస్తామని ఏఎస్పీ వెల్లడించారు. ఆమెవెంట రూరల్ సీఐ శ్రీనివాస్ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి


రమేష్(ఫైల్)

పర్మిట్‌రూంలో అంగన్‌వాడీ కోడిగుడ్లపై డీడబ్ల్యూవో విచారణ

హుజూరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లోని ఓ పర్మిట్ రూమ్‌లో అంగన్‌వాడీ కోడిగుడ్లు ప్రత్యక్షంపై శనివారం డీడబ్ల్యూవో సరస్వతీ విచారణ చేపట్టారు. పట్టణంలోని కరీంనగర్‌రోడ్‌లోని ఓ పర్మిట్‌రూమ్ వద్దకు డీడబ్ల్యూవో సరస్వతీ, ఎక్సైజ్ ఎస్ఐ వినోద్, సీడీపీవో సుగుణ, సూపర్‌వైజర్లు వెళ్లారు. అప్పటికే షాపుయజమాని శ్రీనివాస్ దుకాణాన్ని మూసి వెళ్లిపోయాడు. దీంతో డీడబ్ల్యూవో షాపు యజమానిని పిలిపించాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించడంతో శ్రీనివాస్‌ను పిలిపించారు. కోడిగుడ్లు ఎక్కడి నుంచి వచ్చాయని శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. రంగాపూర్ గ్రామం నుంచి వచ్చాయని తెలియడంతో అక్కడి అంగన్‌వాడీ కేంద్రానికివెళ్లి రికార్డులను పరిశీలించారు. ఈ కోడిగుడ్లు రంగాపూర్ అంగన్‌వాడీ కేంద్రం నుంచి వచ్చాయని విచారణ తేలింది. అనంతరం డీడబ్ల్యూవో సరస్వతీ విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది నిర్లక్ష్యంతో అంగన్‌వాడీ కోడిగుడ్లు పర్మిట్‌రూమ్‌లకు వచ్చాయన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి సంబంధిత అంగన్‌వాడీసిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. హుజూరాబాద్ డివిజన్‌లోని అన్ని అంగన్‌వాడీ సెంటర్లపై తనిఖీలు నిర్వహిస్తామన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది తప్పులు చేస్తే సహించేది లేదన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న డీడబ్ల్యూవో సరస్వతి

కాకతీయ కాలువలో ఫార్మాసిస్టు మృతదేహం

చొప్పదండి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్నకొండ శివారులో చిట్యాలపల్లికి వెళ్లే కాలువవంతెన వద్ద కాకతీయకాలువలో జగిత్యాల ప్రభుత్వఆసుపత్రి ఫార్మసిస్టు మృతదేహం లభ్యమయింది. కాలువలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా మృతుడి వద్ద దొరికిన పర్స్, సెల్‌ఫోన్ ఆధారంగా జగిత్యాల తులసీనగర్‌కు చెందిన ఆవారి అమరేందర్(55)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. కాగా మృతుడు శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లోనుంచి వెళ్లిపోగా శనివారం ఉదయం జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ రెడ్డి తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పిడుగు లచ్చమ్మ(80) అనే వృద్ధురాలు ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలప్రకారం.. లచ్చమ్మకు కొంతకాలంగా మానసిక స్థితి బాగాలేదు. శనివారం ఉదయం గదిలోకి వెళ్లి ఉరి వేసుకొని మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు సదయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

సింగరేణి ఉద్యోగి బలవన్మరణం


పవన్‌కుమార్(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి కాలనీలో శనివారం తెల్లవారుజామున తప్పెట్ల పవన్‌కుమార్(27) అనేసింగరేణి ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాను నివాసం ఉంటున్న క్వార్టర్ బెడ్‌రూం సీలింగ్‌కు ఉరి వేసుకున్నాడు. మృతుడు మహబూబాద్‌జిల్లా మల్యాల గ్రామస్థుడు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో సీనియర్ మైనింగ్ సర్దార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వివాహ విషయంలో చోటు చేసుకున్న ఘటనలే పవన్‌కుమార్ మృతికి కారణమని తెలుస్తున్నది.

తల్లి మందలించడంతో యువతి ఆత్మహత్య

పాలకుర్తి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో శనివారం వ్యవసాయ బావిలో పడి ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన మొండయ్య అత్త మూడురోజుల క్రితం మృతి చెందింది. మొండయ్యకు కుమారుడు, కూతురు రేగుల కవిత(21) ఉన్నారు. మొండయ్య అత్త మృతిచెంది బాధలో కుటుంబ సభ్యులు ఉండగా శనివారం ఉదయం కవిత సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుతోంది. దీంతో తల్లి మందలించగా క్షణికావేశానికి గురయిన కవిత సమీపంలోని వ్యవసాయ పడిలో దూకి ఆత్మహత్య చేసుకొంది. తండ్రి మొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ స్వామి తెలిపారు.

అనారోగ్యంతో వివాహిత బలవన్మరణం

పెగడపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలం బతికెపల్లి గ్రామానికి చెందిన మన్నె నీరజ(40) అనే వివాహిత శనివారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నీరజ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్నిమందులు వాడినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త మన్నె మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మేడిపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలం పసునూర్ గ్రామంలో విద్యుదాఘాతానికి గురై సత్యనాయక్(51) అనేరైతు శనివారం మృతిచెందాడు. సత్యనాయక్ వరిసాగు చేయగా కోతుల బెడద నుంచి రక్షించుకోవడానికి పొలం చుట్టూ ఇనుప తీగను చుట్టి దానికి విద్యుత్‌కనెక్షన్ ఇచ్చాడు. సత్యనాయక్ పొలం ఒడ్డుపైనుంచి వెళ్తున్న క్రమంలో జారి విద్యుత్‌తీగపై పడ్డాడు. గమనించిన కుటుంబీకులు విద్యుత్ కనెక్షన్ తొలగించి చూసేసరికి మృతిచెందాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడికి భార్య భూమిక, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. మృతుడి భార్య భూమిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొట్టిన బైక్

● ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని కేసీఆర్‌నగర్ కాలనీ వద్ద కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి దాటుతున్న ఓ మహిళను శనివారం రాత్రి ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో కేసీఆర్‌నగర్ కాలనీకి చెందిన మహిళ కళావతి, తిమ్మాపూర్ గ్రామంలోని వాహనదారుడు చెక్కల వేణు తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను అక్కడున్న వారు ఓ ఆటోలో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వేణు తన బైక్‌పై ఎల్లారెడ్డిపేట నుంచి తిమ్మాపూర్ వైపునకు వెళుతూ రోడ్డు దాటుతున్న మహిళ కళావతిని అతి వేగంగా ఢీకొట్టాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● పోతిరెడ్డిపల్లిలో కార్డన్ సెర్చ్

వీణవంక, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ మాధవి అన్నారు. వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. కార్డన్ సెర్చ్‌లో 22 ట్రాక్టర్లు, 18ద్విచక్ర వాహనాలు పట్టుకొని సరైన కాగితాలు లేని వాటికి జరిమానా విధించినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 3 ట్రాక్టర్లను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే సహించేది లేదని అన్నారు. మాదక ద్రవ్యాల పట్ల పిల్ల లపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని వయ స్సుకు సంబంధం లేకుండా తీసుకుంటు న్నారని అన్నారు. కార్యక్రమంలో జమ్మికుంటరూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ ఆవుల తిరుపతి, ఇల్లంతకుంట ఎస్ఐ క్రాంతి కుమార్, సైదాపూర్ఎస్ఐ తిరుపతి, జమ్మికుంట ఎస్ఐ సతీష్, హుజురాబాద్ ఎస్ఐ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పోతిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న ఏసీపీ మాధవి

పెట్రోల్ పోసుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మానకొండూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ పోసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన ఆకుల గోపాల్ ఆనే ఉద్యోగరిత్యా పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో కుటుంబంతో నివసిస్తున్నాడు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో ఓ సెల్‌టవర్‌కు విద్యుత్‌ను సరఫరా చేసేందుకు గోపాల్ ఇంటిపై నుంచి విద్యుత్ అధికారులు విద్యుత్ లైన్‌ను తీసుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న గోపాల్ గోదావరిఖని నుంచి స్వగ్రామానికి చేరుకొని ఇంటిపై నుంచి విద్యుత్ తీగలను తొలగించాలని పలుమార్లు అభ్యర్థించాడు. కాగా జాతీయ రహదారి పనులలో భాగంగా కాంట్రాక్టర్ గోపాల్ ఇంటి వద్ద విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశాడు. ఈ విద్యుత్ స్తంభం నుంచి సెల్‌టవర్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. శుక్రవారం తన ఇంటిపై విద్యుత్‌సరఫరా చేయవద్దని బాధితుడు పనులను అడ్డుకున్నాడు. దీంతో విద్యుత్ అధికారులకు బాధితుడు గోపాల్ మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఈ విషయంపై విద్యుత్ ఏఈ లక్ష్మణమూర్తి, బాధితుడు ఒకరిపై ఒకరు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం సీఐ సంజీవ్ సంఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ తీగలను పరిశీలించారు. ఈ విషయంపై చెంజర్ల ఏఈ లక్ష్మణమూర్తిని వివరణ కోరగా పైఅధికారుల సూచన మేరకు సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటానని తెలిపారు.


ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ గోపాల్

హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో పని చేయని ఫ్రీజర్

● కుళ్లిపోయిన మృతదేహం

● ఆస్పత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన బంధువులు

హుజూరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలోని మార్చురిలో ఫ్రీజర్ పనిచేయకపోవడంతో ఓ మృతదేహం కుళ్లిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి.. శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో శుక్రవారం ఉత్తర ప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ కుల్దీప్‌సింగ్ గుండెపోటుతో అక్కడి క్కడే మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి పోలీసులు తరలించారు. ఈ విషయాన్ని వారి కుటుంబసభ్యులకు తెలపగా, హుటాహుటిన బయలుదేరివచ్చారు. రాత్రి ఫ్రీజర్ పనిచేయకపోవడంతో ఉదయం బంధువులు మృతదేహం వద్దకు వెళ్లగా కుళ్లిపోయి దుర్వాసన రావడంతో వైద్యసిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఫ్రీజర్ టెంపరేచర్ సరిగ్గానే చూపిస్తున్నప్పటికీ టెక్నికల్ ఇష్యూ వల్ల పని చేయలేదు. దీనిపై విచారణ జరిపి సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యువతి ఇంటికి నిప్పు అంటించే యత్నం

● యువకుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఓయువతి ఇంటికి నిప్పు అంటించడానికి యత్నించిన యువకుడిని అరెస్టు చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ ఎస్సై రాజన్న తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన చెక్కిళ్ల శివసాయికి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న 24ఏళ్ల యువతి పరిచయమైంది. శివసాయి తరచూ ఆమెతో ఫోన్‌లో మాట్లాడుతూ పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో గతేడాది ఆగస్టులో ఆమె నుంచి రెండుతులాల బంగారు గొలుసును తీసుకున్నాడు. శివసాయి మద్యానికి బానిసగా మారడం, ఏపనీ చేయకపోవడంతో ఆమె దూరంగా ఉంటోంది. దీంతో ఆగ్రహానికి గురైన శివసాయి ఈనెల7నఅర్ధరాత్రి తన స్నేహితుడితో కలిసి యువతి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పెట్రోల్‌పోసి ఇంటికి నిప్పంటించే ప్రయత్నం చేశాడు. పెట్రోల్ వాసనరావడంతో ఆమె కుటుంబ సభ్యులు కేకలువేశారు. దీంతో నింది తుడు అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదుతో శివసాయిని అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు.


నిందితుడు శివసాయిని అరెస్టు చేసిన ఎస్ఐ రాజన్న

ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని పురాణిపేట ప్రభుత్వపాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిని సస్పెండ్‌చేస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల పాఠశాలనుంచి జగిత్యాల పురాణిపేట పాఠశాలకు ట్రాక్టర్‌లో ప్రమాదకర రీతిలో ఫర్నీచర్‌ను విద్యార్థులతో తరలించడంపై సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అకారణంగా తనను తిడుతూ దాడి చేసినవ్యక్తిపై చర్యలు తీసుకోవాలని చిగురుమామిడి మండలం కొండాపూర్‌కు చెందిన పిల్లి సుజాత శనివారం పోలీస్‌కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. ఈనెల7న కొండాపూర్‌కు చెందిన పిల్లిరమేష్ మద్యం మత్తులో తనను తిడుతూ బండరాయితో దాడి చేశాడంది. ఈ విషయంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపింది.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ స్వప్నరాణి


విద్యార్థులతో కలిసి సేవ కార్యక్రమాల్లో పాల్గొన్న స్వప్నరాణి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ స్వప్నరాణి సూచించారు. శనివారం హన్మంతునిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్ఎస్ఎస్ శిబిరంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ స్వప్నరాణి పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కలిసి సేవాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రంగా ఉంటేనే రోగాలు దరిచేరకుండా ఉంటాయన్నారు. విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యదర్శి అశోక్, న్యాయవాదులు శరత్‌కుమార్, ఆర్.ఝాన్సీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సదయ్యపాల్గొన్నారు. గౌరెడ్డిపేట బాలికల జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నరహరి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి దీపం ఇల్లాలు

• నేడు భార్యను ప్రశంసించే రోజు



కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): ఏ ఇంటికైనా దీపం వంటిది ఇల్లాలు. అనాది కాలం నుంచి మన దేశంలో స్త్రీలకు ప్రాధాన్యం ఉంది. సమాజంలో తల్లిగా, చెల్లిగా, భార్యగా, స్నేహి తురాలిగా పలు పాత్రలను పోషిస్తూ పురుషుని విజయాల వెనుక అద్భుత, అదృశ్య శక్తిగా కుటుంబ, సమాజ అభ్యున్నతికి పాటుపడుతున్న స్త్రీని సముచితంగా గౌరవించడంతో పాటు ప్రశంసించడం కూడా తప్పనిసరి. ప్రతిఫలం ఆశించకుండా అన్ని పనులు నిర్విరామంగా చేసే ఏ స్త్రీ అయినా ముఖ్యంగా భార్య కోరుకునేది ఒక ప్రోత్సాహం. ఓ మెప్పు కోలు. ఎలా మెచ్చుకుంటారు? ఏమి చేస్తారనేది ముఖ్యం కాదు. హృదయంలో ఎంత చోటిచ్చారనేదే ముఖ్యం. ఈ సంప్రదాయం ఇంటి నుంచే మొదలవ్వాలని భార్యను ప్రశంసించేందుకు ఓ ప్రత్యేక రోజును కేటాయించారు. ప్రతీ యేటా సెప్టెంబరు నెల మూడవ ఆదివారం జరుపుకునే ఈ రోజు భార్య చేసే పనిని గుర్తించడానికి, ఆమె ప్రేమ, మద్దతును అభినందించడానికి ఒక చక్కని అవకాశం.

● భార్యను అభినందించడానికి పలు మార్గాలు..



పలు అంశాలతో కూడిన నిజమైన హృదయపూర్వక లేఖ రాయాలి. బాధ్యతలు లేని విశ్రాంతితో గల ఓ రోజును కేటాయించాలి. ఆమె ఇష్టాలకనుసారంగా ఒక రోజును ప్లాన్ చేయాలి. పలు రంగాల్లో రూపాతీతమైన ప్రశంస చేయాలి. ఆలోచనాత్మక హావభావాలను ప్రకటించాలి. ఆమె చెప్పే మాటలు శ్రద్ధగా వినాలి. ఆమె చేసే పనులకు ధన్యవాదాలు చెప్పాలి.

● నేపథ్యం...

ఈ దినోత్సవం 2006లో అమెరికాలో ప్రారంభమైంది. పిల్లలు లేని భార్యలను గౌరవించడం లక్ష్యంగా ఉన్నా కాలక్రమేణా దీన్ని భార్యలను ప్రశంసించే రోజుగా సార్వజనీనం చేశారు. దీంతో భావోద్వేగ సంబంధాలు బలపడి భాగస్వాములిద్దరికీ ఆనందం పెరుగుతుందని పరిశోధనలు చెబుతున్నాయి.

● భార్యా భర్తలు హాయిగా జీవించాలి..

ప్రతీ నిత్యం కజ్జాలు, పోట్లాటలతో కాకుండా ప్రేమ, సహనం, అవగాహనతో భార్యా భర్తలు హాయిగా జీవించాలి. కేవలం అవగాహనా రాహిత్యం, ఆధిపత్య పోరుతో ఎన్నో కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. పంచాయితీలు, పోలీసు స్టేషన్లు, కోర్టుల వరకు వ్యవహారాలు చేరి సమాజంలో విలువ లేకుండా పోతున్న కుటుంబాలను మనం చూస్తూనే ఉన్నాం. దీనికి పరస్పరం తెలియకుండా చేసుకునే ప్రశంస, ఉమ్మడి కుటుంబ జీవన విధానాలే ఉత్తమ కుటుంబ సౌధానికి పునాదులు. మరి ఇంకేం! భార్యలను ప్రశంసించి, ఓ నవ్వు రువ్వుతూ ఆనందమయ సంసార

ఖని బస్టాండ్ నుంచి బీదర్‌కు ప్రత్యేక బస్సు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ నుంచి కర్ణాటకలోని బీదర్‌కు ఈ నెల 23న సూపర్ లగ్జరీ సర్వీస్‌ను నడిపిస్తున్నట్టు డిపో మేనేజర్ నాగభూషణం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీస్ 23న రాత్రి 9గంటలకు బయలుదేరి 24న ఉదయం బీదర్‌కు చేరుకుని బీదర్‌లోని శ్రీక్షేత్ర ఝరాణి, నర్సింహస్వామి దర్శనం, రేచింతల్‌లోని వరసిద్ధి వినాయకుని దర్శనం అనంతరం ఝరాసంగంలోని శ్రీకేతకీ సంగమేశ్వర స్వామి దర్శనం చేసుకుని 24న రాత్రి గోదావరిఖనికి చేరుకుంటుందన్నారు. ఈ సర్వీస్‌కు చార్జి పెద్దలకు 1,600 రూపాయలు, పిల్లలకు 1,250 రూపాయలుగా నిర్ణయించినట్టు, వివరాలకు 7013504982, 7382847596 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మహిళ అదృశ్యం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని రాంనగర్‌కు చెందిన మంజుల అనే మహిళ రెండు రోజుల నుంచి కనపడకుండా పోయిందని రెండో ఠాణా పోలీసులు తెలిపారు.

ఆమె ఆరోగ్యపరిస్థితి సరిగా లేనందున ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. మంజులను గుర్తించినవారు టూటౌన్ సీఐ 8712670762నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

దక్షిణ భారత అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక




రాష్ట్రస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా బాలుర జట్టు, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటిన తాటిపల్లి బాలికల గురుకుల విద్యార్థులు, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సరితాదేవి, ఉపాధ్యాయులు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దక్షిణభారత అథ్లెటిక్స్ పోటీలకు కరీంనగర్ జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో డి రణధీర్‌చరణ్, కె స్వామి ప్రతిభ చాటారు. ఈనెల 23 నుంచి 25 వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించనున్న జాతీయ పోటీల్లో పాల్గొననున్నారు. అండర్-18 విభాగంలో ఐదు వేల మీటర్ల రేస్‌వాక్‌లో డి రణధీర్‌చరణ్, అండర్-20 విభాగంలో జావెలిన్‌త్రోలో కె స్వామి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్ రెండువేల రూపాయలు అందించి అభినందించారు.

● రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు..

మల్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన యం లతిక అనే విద్యార్థిని తైక్వాండో అండర్-14 విభాగంలో జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం. జి శాంతిరాజు, పీడీ అంకం శేఖర్ తెలిపారు. ఎ విష్ణువర్ధన్ అండర్-17, యం లతిక అండర్-14 విభాగంలో నిర్వహించిన చెస్ పోటీల్లో జగిత్యాల జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

● జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా యువజన, క్రీడలు శాఖ ఆధ్వర్యంలో జగిత్యాలలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు పీఈటీ మధులిక తెలిపారు.

● రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు విద్యార్థిని..

జగిత్యాలరూరల్ (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న పేరాల కృష్ణక అనే విద్యార్థిని ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి చెస్ క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థినిని ప్రిన్సిపాల్ సరితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ నాగేష్, పీడీలు వినీత్, అజీమ్, ఉపాధ్యాయులు అభినందించారు.

● ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలకు స్పందన


రణధీర్‌చరణ్‌ను అభినందిస్తున్న జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్

కరీంనగర్ స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల్లో క్రీడా సమాఖ్య అండర్-19 ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన పోటీలకు 98 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా జూనియర్ కళాశాలల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి జి మధు జాన్సన్ క్రీడలను ప్రారంభించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి అండర్-19 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక చేశారు. పీడీలు, కోచ్‌లు చందు, బి రాజశేఖర్, బానోత్ రాజు, అంజయ్య, సురేష్, రాజు నాయక్, విజయ్ వలీపాషా, సతీష్, పి అనూష్, సయ్యద్ సబీ, తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం సరైన మార్గం

- హైకోర్టు జడ్జి శ్రీనివాస్‌రావు

కరీంనగర్ లీగల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం సరైన మార్గమని హైకోర్టు న్యాయమూర్తి, గవర్నర్ల బోర్డు, మధ్యవర్తిత్వం, మధ్యవర్తిత్వ కేంద్రం హైదరాబాద్ సభ్యుడు జె శ్రీనివాస్ రావు అన్నారు. మధ్యవర్తిత్వంపై జిల్లావ్యాప్తంగా 90 మంది న్యాయవాదులకు ఐదు రోజులపాటు నిర్వహించిన శిక్షణ ముగింపు సందర్భంగా శనివారం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు అతి తక్కువ ఖర్చుతో, అతి తక్కువ సమయంలో పరిష్కరించవచ్చని, దీంతో న్యాయస్థానాలపై భారం తగ్గుతుందని అన్నారు. కక్షిదారులకు డబ్బు, సమయం వృథా కాకుండా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు కక్షిదారు లకు మధ్యవర్తిత్వంపై వివరించారు. మధ్యవర్తిత్వం ద్వారా తమ కేసు పరిష్కారం కాకపోతే తిరిగి చట్ట ప్రకారం న్యాయస్థానంలో ఆ కేసును పరిష్కరించుకోవచ్చన్నారు. శిక్షణ పొందిన న్యాయవాదులు మధ్యవర్తిత్వం ద్వారా కేసును విజయవంతంగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన న్యాయవాదులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ మెంబర్, సెక్రెటరీ సీహెచ్ పంచాక్షరి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె శివకుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె వెంకటేశ్, స్థానిక న్యాయమూర్తులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా


డీజీ సౌమ్య మిశ్రకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా శనివారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆమెకు పోలీసుల గౌరవ వందనం సమర్పించారు. అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారి శేష వస్త్రం, అమ్మవారి వస్త్రంతో పాటు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. వారివెంట జైళ్లశాఖ డీఐజీ సంపత్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, వేములవాడ అదనపు ఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఎస్సై ఎల్లగౌడ్, ఆర్ఎస్ఐ రాజు, ఆలయ సూపరింటెండెంట్ నరేందర్, సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

శ్రీరాంసాగర్‌కు 2.13 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరద నీరు రావడం శనివారం కొనసాగింది. 39 గేట్లు పైకి ఎత్తి 1,97,010 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 2,13,285 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీపాద ఎల్లంపల్లికి 2.52 లక్షల క్యూసెక్కులు..

పెద్దపల్లి (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి శనివారం సాయంత్రం వరకు 2,52,397 క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. దీంతో గోదావరిలోకి 21 గేట్ల ద్వారా 2,21,130 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 20.092 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

మిడ్ మానేరుకు ఏడు వేల క్యూసెక్కులు..

బోయినపల్లి (ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర జలాశయనికి(మిడ్ మానేరు) ప్రాజెక్టుకు శనివారం 7000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుంది. పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు గాను ప్రస్తుతం 317.89 సామర్థ్యం 27.55 టీఎంసీలకు గాను 27.273 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నిలిచిన ఎత్తిపోతలు

ఇల్లంతకుంట (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలను అధికారులు శనివారం నిలిపివేశారు. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.29 టీఎంసీల నీరు ఉంది. గత నెల19న నీటి ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి నాలుగు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోశారు.

నిలకడగా ఎల్ఎండీ నీటి మట్టం

తిమ్మాపూర్ (ఆంధ్రజ్యోతి): దిగువ మానేరు జలాశయంలోకి వస్తున్న నీటి నిల్వలు తగ్గుతుండటంతో ఎల్ఎండీలో నీటి మట్టం నిలకడగా కొనసాగుతోంది. ఎల్ఎండీ పూర్తి నీటి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.645 టీఎంసీల నీరునిల్వ ఉంది. ఎల్ఎండీలోకి ఇన్‌ఫ్లో తగ్గుతుండటంతో శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఎల్ఎండీ రెండు గేట్లు మూసి నాలుగు గేట్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

రాజన్న ఆలయానికి పండుగ శోభ

- ఆలయంలో ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు



విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న రాజన్న ఆలయం, ఆలయ ధర్మగుండంలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద పండుగశోభ నెలకొంది. శనివారం రాత్రి విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. దేవినవరాత్రోత్సవాలు, బతుకమ్మ సంబరాలను పురస్కరించుకుని రాజన్న ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి పట్టణానికి చెందిన మహిళలు, యువతులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చుకుని ఆలయానికి తరలివచ్చారు.

ఆలయ ప్రాంగణంలోని విద్యుత్ దీపాల అలంకరణలో బతుకమ్మ పాటపాడుతూ కోలాటం ఆడుతూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ధర్మగుండంలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఆలయానికి బతుకమ్మ ఆడేందుకు వచ్చిన మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రమాదేవి ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

● వైభవంగా మహాలింగార్చన

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం మహాలింగార్చన కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. మాసశివరాత్రిని పురష్కరించుకుని స్వామి వారికి ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, పరివార దేవతార్చనలు సాయంత్రం ఆలయంలో మహాలింగార్చన ఘనంగా చేపట్టారు. లింగాకృతిలో దీపాలను వెలిగించి వేదమంత్రోచ్చరణలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.


రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా లింగార్చన పూజలు చేస్తున్న అర్చకులు

● ధర్మపురిలో..

ధర్మపురి (ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రి పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కు మార్‌శర్మ ఆధ్వర్యంలో స్థానిక వేదపండితులు మహాలింగార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు పనతుల వెంకటరమణశర్మ, మధు శంకర్‌శర్మ, మధు రామశర్మ, జనుమంచి రాములు శర్మ, కొరిడె శంకర్‌శర్మ, పెండ్యాల చంద్రశేఖర్‌శర్మ, పెండ్యాల రాజేష్ శర్మ, అర్చకులు ద్యావళ్ల సాయికుమార్, ద్యావళ్ల విశ్వనాథ్‌శర్మ, బొజ్జ రాజగోపాల్‌శర్మ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో డిస్కమ్స్ పోటీల్లో రన్నరప్‌గా కరీంనగర్ సర్కిల్



బ్యాడ్మింటన్ రన్నరప్ ట్రోఫీని అందుకుంటున్న కరీంనగర్ సర్కిల్ జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌కో, డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ బ్యాడ్మింటన్, చెస్ పోటీల్లో కరీంనగర్ సర్కిల్ రన్నరప్‌గా నిలిచింది. ఈ నెల 18, 19, 20 తేదీల్లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో 27 జట్లు తలపడ్డాయి. ఫైనల్‌లో వరంగల్ జట్టుపై పోరాడి ఓడిన కరీంనగర్ సర్కిల్ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. చదరంగం పోటీల్లో 15 జట్లు తలపడగా ఫైనల్‌లో హైదరాబాద్ కార్పొరేట్ ఆఫీస్ జట్టుతో పోరాడి ఓడిన కరీంనగర్ సర్కిల్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కరీంనగర్ జట్టుకు జీఆర్ఐడీ అండ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ జి సంపత్ కుమార్ ట్రోఫీలను ప్రదానం చేశారు. కరీంనగర్ సర్కిల్ బ్యాడ్మింటన్ జట్టులో పి రామ్మోహన్‌రావు, సీహెచ్ సంపత్, జి శ్రీనివాస్, షేక్ అహ్మద్, బి శ్రీకాంత్, పి రోహిత్‌రెడ్డి, చదరంగం జట్టులో ఎం నాగరాజు, ఎం చంద్రకిరణ్, సీహెచ్ శ్రీకాంత్, ఎస్ రాజ్‌కుమార్, ఓ రాజు పాల్గొన్నారు.

12ఏళ్ల క్రితం జారీ చేసిన..

ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ రద్దు

కోల్‌సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుటుంబసభ్యుల వివరాలను దాచిపెట్టి రామగుండం రెవెన్యూ అధికారులు జారీ చేసిన తప్పుడు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను ఆర్డీవో బీ గంగయ్య రద్దు చేశారు. ప్రొసీడింగ్ సీ2/2996/2025 ద్వారా ఆదేశాలు జారీ చేశారు. గోదావరిఖని మేదరిబస్తీకి చెందిన వేరుకొండ కొమురయ్య విజయనిర్మల సామిల్ పేర వ్యాపారం నిర్వహించేవారు. 2013లో అతడు మరణించాడు. అతనికి భార్య ఎల్లమ్మతో పాటు నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. ఇందులో ఒక కుమార్తె మంజుల పేరు లేకుండానే భార్య ఎల్లమ్మ పేర తహసీల్దార్ 2013 డిసెంబరు 31న ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేశారు. కుమారుడు శ్రీనివాస్, మిగతా ముగ్గురు సోదరీమణులు, తల్లి అంగీకారం ఉందంటూ సామిల్ లైసెన్స్‌ను తన పేరుపై మార్చుకున్నాడు. కొన్ని సంవత్సరాల తరువాత ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌లో తన పేరు లేకుండా జారీ చేశారని బయట పడడంతో కుమార్తె వేరుకొండ మంజుల సర్టిఫికెట్‌ను రద్దు చేయాలంటూ కలెక్టర్‌కు ఈ ఏడాది మే 9న దరఖాస్తు చేసుకొంది. దీనిపై కలెక్టర్ రామగుండం తహసిల్దార్‌తో విచారణ జరిపించారు. వేరుకొండ మంజుల స్టడీ సర్టిఫికెట్లు, క్షేత్రస్థాయి విచారణ తరువాత కలెక్టర్‌కు నివేదించారు. ఈ మేరకు సర్టిఫికెట్‌ను రద్దు చేయాలంటూ కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆర్డీఓకు సూచించారు. దీంతో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను రద్దు చేస్తూ ఆర్డీవో ఆదేశాలు జారీ చేశారు. అలాగే మంజులను ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కాగా, సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు, ఆస్తుల వివాదాల నేపథ్యంలో కొందరు ఫ్యామిలీ మెంబర్లు మాత్రమే సర్టిఫికెట్‌లో చేర్చి జారీ చేస్తున్నారనే విమర్శలున్నాయి. పూర్తిస్థాయి విచారణ చేయకుండా సర్టిఫికెట్లు జారీ చేయడంపై గతంలోనూ వివాదాలు జరిగాయి. ఇప్పుడు 12ఏళ్ల క్రితం జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ రద్దుకావడం చర్చనీయాంశమైంది.

అటవీ అధికారులను నిర్బంధించిన గ్రామస్థులు

- అటవీ భూములు అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకోవడం లేదని నిరసన



ఫారెస్ట్ అధికారులను నిర్బంధించిన గ్రామస్థులు, గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసులు

రుద్రంగి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అటవీ భూములు అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకోవడం లేదని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో అటవీశాఖ అధికారులను గ్రామస్థులు అడ్డుకున్నారు. అటవీ భూమిలోని నీలగిరి చెట్లను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నరికి వేయడంతో శనివారం అధికారులు పరిశీలించారు. విచారణ కోసం ఫారెస్ట్ అధికారులు, పోలీసులు గ్రామపంచాయతీ వద్దకు చేరుకోగా గ్రామస్థులు ఎఫ్ఆర్‌వో ఖలిలోద్దీన్, ఫారెస్ట్ అధికారులను గ్రామపంచాయతీలో నిర్బంధించారు. చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుమారు మూడు గంటల పాటు యువకులు, గ్రామస్థులు ఆందోళన చేయడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సీఐ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకుని గ్రామస్థులతో మాట్లాడి వారి డిమాండ్‌ను జిల్లా ఫారెస్ట్ అధికారి బాలామణికి తెలిపారు. అన్యాక్రాంతమైన భూముల్లో వెంటనే ప్లాంటేషన్ చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

రామగుండం ఎన్టీపీసీకి సీఐఐ ఎనర్జీ ఎక్స్‌లెన్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న ఎన్టీపీసీ అధికారులు

జ్యోతినగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీకి ప్రతిష్ఠాత్మక కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) ఎనర్జీ ఎక్స్‌లెన్స్ 2025 అవార్డు లభించింది. నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలలో సమర్థవంతంగా పనిచేసినందుకు రామగుండం ప్రాజెక్టుకు అవార్డును ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ హైటెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్టీపీసీ అధికారులు ఎం వంశీకృష్ణ, జి కృష్ణ, సచిన్ బైవార్ అవార్డును అందుకున్నారు. అధికారులను, ఉద్యోగులను ప్రాజెక్టు ఈడీ చందన్ కుమార్ సామంత అభినందించారు.

గర్జనపల్లి విద్యార్థినికి ఎంబీబీఎస్ సీటు


విద్యార్థిని స్పందన

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు20: మారుమూల గ్రామంలో జన్మించి ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో విద్యనభ్యసించిన వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని నలిమేటి స్పందన ఎంబీబీఎస్‌లో సీటు సాధించి తల్లిదండ్రుల కలను నెరవేర్చింది. గ్రామంలోని నలిమేటి సుజాత-నాగరాజు దంపతుల పెద్ద కూతురు స్పందన స్థానిక పాఠశాలతో పాటు వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదివింది. నేరేళ్ల గురుకులంలో ఇంటర్ పూర్తి చేసింది. డాక్టర్ కావాలనే కోరికతో స్పందన హైదరాబాద్‌లో శిక్షణ తీసుకుంది. పట్టుదలతో చదివి నీట్ ఫలితాల్లో మంచి ర్యాం కు సాధించి సిద్దిపేటలోని ఆర్‌వీఎం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. విద్యార్థిని స్పందనను శనివారం ఎంపీటీసీల ఫోరం తాజా, మాజీ మండల అధ్యక్షుడు అరుణ్‌కుమార్, ఆదర్శ పాఠశాల పీడీ ప్రతాప్‌కుమార్, స్థానికులు అభినందించారు.

దాచారం గ్రామంలో వైద్యశిబిరం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాచారం గ్రామంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మహిళలు పౌష్టిక ఆహారం తీసుకోవాలని అప్పుడే వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మాధవి, ప్రేమ్‌కుమార్, గౌస్‌పాషా, ప్రమోద, మౌనిక, రసజ్ఞ, రహిమాసుల్తానా, వెంకటరమణ, అనీల్‌కుమార్, ప్రసాద్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఘన సన్మానం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు20: జై గౌడ ఉద్యమ కమిటీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన పందిర్ల లింగాగౌడ్, గంట వెంకటేశ్‌లను మండల కేంద్రంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. గౌడ కుల సంఘం సభ్యుల సమస్యలపై పోరాడుతున్న లింగాగౌడ్, వెంకటేశ్‌గౌడ్‌లను గుర్తించి పదవులు ఇవ్వడం హర్షనీయమని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఏజీసీ కృష్ణ, నాయకులు గిరిధర్‌రెడ్డి, బాబు, శ్రీనివాస్, బుచ్చాగౌడ్, తిరుపతి, అంజయ్య, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న టేకు కలప పట్టివేత

చందుర్తి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న టేకు కలపను చందుర్తి పోలీసులు శనివారం పట్టుకున్నారు. చందుర్తి ఎస్‌ఐ రమేష్ కథనం ప్రకారం చందుర్తి మండల కేంద్రానికి చెందిన బొల్లు దేవరాజు మండల కేంద్రం శివారులోని అటవీ ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రెండు టేకు దుంగలను అక్రమంగా నరికి, తన ద్విచక్ర వాహనం నంబర్ ఏపీ 15ఏవి 2706పై తరలిస్తుండగా చందుర్తి బస్టాండ్‌లో పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న టేకు దుంగలతో పాటు ద్విచక్ర వాహనాన్ని అటవీ శాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

చందుర్తి సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం మర్రిగడ్డలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు దారం రాజిరెడ్డి, మూడపెల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు కొమ్ము శంకర్ తల్లి కనుకవ్వ, కట్టలింగంపేట గ్రామంలో కొమురవెల్లి రత్నమ్మలు మృతి చెందగా శనివారం నియోజకవర్గ బిఆర్‌ఎస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి కుటుంబీకులను పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షులు మ్యాకల ఎల్లయ్య, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, మాజీ ఏఎంసీ ఛైర్మెన్ దప్పుల అశోక్, మాజీ కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కిషన్‌రావు, మాజీ సర్పంచులు చిలుక అంజిబాబు, దుమ్మ అంజయ్య, లక్ష్మణ్ రావు నాయకులు రమేష్ రావు, రమేష్ గౌడ్, బత్తుల కమలాకర్, బొడిగె అనిల్ గౌడ్, కత్తి శ్రీనివాస్ ఉన్నారు.

పశు వైద్యశాల వద్ద బీజేపీ నాయకుల శ్రమదానం

తంగళ్లపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ శ్రేణులు తంగళ్లపల్లి మండల కేంద్రంలోని పశు వైద్యశాల అవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. దీంట్లో భాగంగా వైద్యశాల అవరణలోని చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు, నాయకులు కాసుగంటి రాజురావు, ఇటికల రాజు, కోసిని వినయ్ యాదవ్, రెడ్డిమల్ల ఆశీర్వాద్ ఇటిక్యాల మహీందర్, బండారి మల్లికార్జున్, బాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డులు అందజేత

కోనరావుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నిజామాబాద్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఐడి కార్డులను అందజేశారు. ఖమ్మం వాస్తవ్యులు ప్రస్తుతం ఎల్లారెడ్డిపేట డిగ్రీ లెక్చరర్ వంటి సాంబశివరావు తన తండ్రి జ్ఞాపకార్థం పది వేల విలువ గల ఐడి కార్డులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు షాబుద్దీన్ తదితరులు ఉన్నారు.

పాఠశాలకు సమరయోధుల చిత్రపటాలు అందజేత

కోనరావుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం వటిమల్ల ప్రభుత్వ పాఠశాలకు శనివారం స్వతంత్ర సమరయోధుల చిత్రపటాలను గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు బానోతు నరేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్ర నేటి తరానికి అందించడానికి ఈ సందర్భంగా పూజ చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం తిరుపతిరావు, ఉపాధ్యాయులు గంగాధర్, కమలాకర్, గంగాధర్ నాయక్, గొల్లపల్లి సాయికుమార్ తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట విద్యార్థుల ప్రతిభ

గంభీరావుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఉషు అండర్ 17 బాలబాలికల ఎంపిక పోటీలలో గంభీరావుపేట విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారు. వివిధ కేటగిరీలలో పాల్గొని 7 బంగారు, 1 వెండి, 3 కాంస్య పథకాలు సాధించారు. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్, కోచ్ విక్రమ్, ఎంఈవో గంగారాం తదితరులు అభినందించారు.

డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

గంభీరావుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే సంబరాలు నిర్వహించారు. కళాశాలలో చదవుతున్న ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థిని, విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీల్డు అసిస్టెంట్లకు అందని వేతనాలు

చందుర్తి సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రెండు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారమై, అప్పుల పాలవుతున్నమని ఉపాధి హామీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు వినతి పాత్రాలు అందిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆందోళన చెందుతున్నారు. చందుర్తి మండల వ్యాప్తంగా 19 గ్రామపంచాయతీగా పరిధిలో 19 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు 14మంది విధులు నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా 4,468 జాబ్ కార్డులలో 6,594 ఉపాధి కూలీలు ఉన్నారు. దాదాపు 2500 మంది పనులు నిర్వహిస్తున్నారు.

సెప్టెంబరు నెల గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం 2 నెలల వేతనం విడుదల చేయకపోవడంతో దినదిన గండంగా, కుటుంబ పోషణ భారమై, అప్పుల పాలవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందరికీ ఒకే విధమైన గౌరవ వేతనాన్ని రూ. వేలు అందించాలని కోరుతున్నారు. శాసన సభ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లలకు అనేక హామీ ఇచ్చి, అమలు చేయడం లేదని, కాంగ్రెస్ హామీలు అందని ద్రాక్షల ఉన్నాయని, ప్రభుత్వం స్పందించి హామీలను అమలు చేయాలని కోరుతున్నారు.

వేతనాలు వెంటనే చెల్లించాలి

● గసికంటి జోసెఫ్, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు

ప్రభుత్వం ప్రతి నెలా మొదటి వారంలో వేతనం చెల్లించాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రతి గ్రామపంచాయతీకి ఒక ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలి. పిల్లల స్కూల్ ఫీజులు, మహిళా సంఘాల చిట్టీలకు, కుటుంబ పోషణకు ఇబ్బంది అవుతుంది.

పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు


శ్రీ కృష్ణవేణి హై స్కూల్‌లో వేడుకలు


వివేకానంద విద్యానికేతన్ విద్యార్థినులు


సెలెస్టియల్ హై స్కూల్‌లో బతుకమ్మ వేడుకలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ బతుకమ్మ మా బంగారు బతుకమ్మా... అంటూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయలకు అద్దం పట్టే విధంగా ముందస్తు బతుకమ్మ వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో విదార్థినులు ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్, వివేకనంద విద్యానికేతన్, ఇంగ్లీష్ యూనియన్, సెలెస్టియల్ హై స్కూల్, నెహ్రూనగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు ఎంగిలి పూలతో బతుకమ్మను పేర్చి బొడ్డమ్మలకు పూజలు నిర్వహించి సంప్రదాయ దుస్తులతో బతుకమ్మ ఆట పాటలతో కనువిందు చేశారు. కార్యక్రమంలో శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ రాజురెడ్డి, వివేకనంద విద్యానికేతన్ ప్రిన్సిపల్ బుచ్చారావు, డైరెక్టర్ మహేందర్‌రెడ్డి, ఇంగ్లీష్ యూనియన్ హై స్కూల్ కరస్పాడెంట్ రాజ్‌కుమార్, సెలెస్టియల్ హైస్కూల్ కరస్పాండెంట్ రాధకృష్ణప్రసాద్, నెహ్రూనగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యరేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాలతో పాటు కిషన్‌దాస్‌పేట, నారాయణపూర్, బండలింగంపల్లి, వెంకటాపూర్, దుమాల, అల్మాస్‌పూర్, రంగంపేట, అడవిపదిర, గర్జనపల్లి, మద్దిమల్ల తదితర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భువన ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బతుకమ్మ పాటను చిత్రీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, ఎంఈవోలు కృష్ణహరి, శ్రీనివాస్, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో పలు పాఠశాలల్లో శనివారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు జరిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నారు.

ఇల్లంతకుంట : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. జిల్లాపరిషత్ పాఠశాల, వాణీనికేతన్, కందికట్కూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, పొత్తూరు గ్రామంలోని వివేకానంద, వల్లంపట్ల గ్రామంలోని కేరళమాడల్ తదితర పాఠశాలలో శనివారం విద్యార్థులు పేర్చుకొని వచ్చిన బతుకమ్మలను పాఠశాలల ఆవరణలో ఉంచి బతుకమ్మ ఆడారు.

తంగళ్లపల్లి : మండల కేంద్రంలో శ్రీ సరస్వతీ శుభోదయం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్, ప్రిన్సిపాల్ మాధవి లతారెడ్డి, ప్రీప్రైమరి ఇన్‌చార్జి పద్మశ్రీ, మమత, సరిత, రూప, లావణ్య, వనిత తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: మండలంలోని జోగాపూర్, ఎనగల్, సనుగుల, రామారావుపల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ రాజు, గుర్రం కృష్ణారెడ్డి, కట్కూరి ముఖేష్, శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్ పర్సన్ లావణ్య సాంస్కృతిక క్లబ్ ఇన్‌చార్జి మెడికల అంజయ్య, ఉపాధ్యాయులు మహేష్, జావీద్, గోవర్ధన్, శ్రీనివాస్, పద్మ, నర్సయ్య, వంగ తిరుపతి, జి. శ్రీలత, సంఘవి, పల్లవి, గీతా, మమత, లాస్య, పద్మ ప్రభావతి, జమున పాల్గొన్నారు. నర్సింగాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో లక్కీ డిప్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్. జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ డ్రాలో వచ్చిన ముగ్గురు మహిళ విజేతలకు పాఠశాల తరఫున చీరలు బహుమతులుగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జితేందర్, ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు అనిత కర్ర శ్రీధర్ పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని వెంకటరావుపల్లి రూసో బీఎడ్, డీఎడ్ రూసో కళాశాలతో పాటు మోడల్ స్కూల్ వివిధ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ దేవేందర్, విద్యార్థులకు బతుకమ్మ పండుగ విశిష్టతను వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకలను పాఠశాలలో నిర్వహించడం పట్ల అందరూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంపత్, అధ్యాపకులు రాజ్ కుమార్, సురేష్, మోహన్,బాలయ్య, మౌనిక, సత్యం, ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ సుద్దాల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ముందస్తు బతుకమ్మ సంబరాలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. హెచ్‌ఎం మదన్ లాల్, ఉపాధ్యాయులు విజయ్ కుమార్, భాస్కర్, వెంకటేష్, సంజీవ్, శృతి, అనూష, రాధ తదితరులు ఉన్నారు.


ఎల్లారెడ్డిపేటలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు


గంభీరావుపేట అక్స్‌ఫర్డ్ పాఠశాలలో వేడుకలు


తంగళ్లపల్లి శుభోదయం పాఠశాలలో వేడుకలు

ఒక్కేసి పువ్వేసి చందమామ

(5వ పేజీ తరువాయి)

గౌరి దేవిని కీర్తిస్తూ ప్రధాన కూడలి వద్ద ఆడ పడుచులు బతుకమ్మ ఆట పాట ఆడుతారు. చీకటి పడుతున్న వేళ ఊరి శివారులోని వాగులు, చెరువుల వద్దకు ఊరేగింపుగా తీసుకొని వెళ్లి పెద్ద బతుకమ్మకు వీడ్కోలు పలుకుతారు. రకరకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఆడ పడుచులు పల్లెంలో తెచ్చిన నీటితో వాయి నమ్మ వాయినమ్మ అంటూ వాయినాలు ఇచ్చుకుంటారు.

● రోజుకో పేరుతో ఫలహారం

ప్రపంచంలో ఏ దేశంలో లేని సంస్కృతి కేవలం తెలంగాణ ఆడపడు చులకు ఆరాధ్యంగా ఉన్న బతుకమ్మకు రోజుకో పేరుతో పిలుచుకుంటూ ఫలహారాన్ని సమర్పించుకుంటారు. మాపటేల ఆటపాటలతో రకారకాల ఫలహారాలు బతుకమ్మకు సమర్పించి వాయనాలుగా ఇచ్చి పుచ్చుకుంటారు. పల్లెల బాధలను, గాథలను, మంచి చెడులను తెలియజెప్పే పాటలతో గడిపే మహిళలు గౌరమ్మకు ఫలహారాలు నైవేద్యంగా పెడుతారు.

విద్యార్థినుల ప్రతిభ

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆంగ్లభాషా సామర్థ్యాలపై రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయిలో నిర్వహించిన డిబేట్ కాంపిటేషన్‌లో జిల్లా కేంద్రం నెహ్రూనగర్‌కు చెందిన జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ కనబరచి మొదటి స్థానంలో నిలిచారు. జిల్లా సెక్టోరల్ అధికారి శైలజ విద్యార్థినులకు మెరిట్ సర్టిఫికెట్లను అందించారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి కాంపిటేషన్‌కు ఎంపి కైన విద్యార్థినులు సబ్బని హరిణి, ముత్తు కావ్య, గాజుల లౌక్య శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖ, ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యరేఖ మాట్లా డుతూ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి విజయం సాధించా లని ఆకాంక్షించారు. విద్యార్థినుల విజయంలో కీలక పాత్రను పోషించిన పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు గన్నమనేని శ్రీనివాసరావును అభినం దించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కరుణశ్రీ, రాజశేఖర్, భారతి, సలావుద్దీన్, కీర్తి, ప్రకాష్, శరత్ బాబు, షేక్‌ఖాజా, భూమేష్, శ్రీకాంత్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారంలో పురుగుల ఘటనపై ఆరా

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీలో ఉపాధ్యాయినులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి విద్యార్థినుల ప్రగతికి బాటలు వేయాలని ఎంపీడీవో బీరయ్య, ఎంఈవో శ్రీనివాస్‌లు అన్నారు. ఈ నెల 19న అల్పాహారంలో భాగంగా అందించిన ఉప్మాలో పురుగులు వచ్చిన ఘటనపై అధికారులు శనివారం ఆరా తీశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక ప్రజాప్రతినిధులు, కేజీబీవీ సిబ్బంది, నాయకులు, తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆహార పదార్థాలు తయారు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అల్పాహారంలో పురుగులు రావడం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొంటూ పాఠశాల ప్రత్యేక అధికారి శకుంతలకు ఇన్‌చార్జి డీఈవో వినోద్‌కుమార్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ సమావేశంలో సెస్ డైరెక్టర్ మల్లేశం, ఏఎంసీ చైర్మన్ రాములునాయక్, వైస్ చైర్మన్ లక్ష్మణ్, తాజా, మాజీ ఉప సర్పంచ్ రవి, నాయకులు శ్రీనివాస్, కాంతయ్య, భగవంతం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించాలి

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారి, సశక్త్ అభియాన్ ద్వారా జిల్లాలోని ప్రతి మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు. వేములవాడ మండలం చీర్లవంచ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్‌సెంటర్, ఏరియా ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, బస్తీ దవఖానాలో కలిపి 82 ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేస్తారని వివరించారు. ప్రతి రోజు 10 మంది ప్రత్యేక వైద్య నిపుణులతో ఆసుపత్రుల్లో అన్ని ఆరోగ్య పరీక్షలు చేస్తారని తెలిపారు. మహిళల్లో ఎక్కువగా కనిపించే రక్తహీనత డయాబెటిస్, రక్తపోటు సమస్యలపై ప్రత్యేక పరీక్షలు సలహాలు అందించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబం అనే కార్యక్రమంతో ప్రత్యేక వైద్య నిపుణులచే కంటి పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు, రక్తపోటు, దంత పరీక్షలు, నోటి కాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ పరీక్షలు, గర్భిణీలకు పరీక్షలతో పాటు పోషకాహారంపై అవగాహన కల్పించారు. వారి వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత తదితరులు ఉన్నారు.


చీర్లవంచలో వైద్య పరీక్షలు పరిశీలిస్తున్న కలెక్టర్

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

గంభీరావుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం కొత్తపల్లి, నాగంపేట గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం బీజేపీ నాయకులు సైకిళ్లను అందజేశారు. సిఎస్ఆర్ నిధులతో మోదీ కానుకగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదినం సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా కొత్తపల్లిలో 75, నాగంపేటలో 34 సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు కోడె రమేష్, మాజీ అధ్యక్షుడు గంట అశోక్, ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి దేవేందర్‌యాదవ్, జిల్లా అధికార ప్రతినిధులు దేవసాని కృష్ణ, ప్రసాద్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు మల్లేశ్‌యాదవ్, విగ్నేష్‌గౌడ్, నాయకులు నవీన్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, ఎలెందర్, శ్రావణ్, రాఖేష్, దేవరాజు, దేవగౌడ్, అనిల్, భాస్కర్, వెంకటేష్, కిషన్, పర్శరాములు, బాలరాజు తదితరులు ఉన్నారు.


నాగంపేటలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

● వేములవాడ పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్

వేములవాడ, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : బలవంతపు వసూళ్లకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వేములవాడ పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులను ఆసరాగా చేసుకొని బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న హిజ్రాలకు శనివారం స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. రాజన్న సన్నిధికి వచ్చిన భక్తులను డబ్బులు డిమాండ్ చేస్తూ ఇవ్వని వారిపై దాడులు చేస్తూ, యువకుల పట్ల వికృత చేష్టలు చేస్తున్నట్లుగా ఆరోపణలు రాగా ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించినట్లు సీఐ తెలిపారు. భక్తులు ఏదైనా మర్యాదపూర్వకంగా ఇస్తే మాత్రమే తీసుకోవాలని బలవంత వసూళ్లకు పాల్పడితే ఇకపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇకపై రాజన్న ఆలయ పడమటి ద్వారం వద్ద మఫ్టీలో ఉన్న పోలీసులు హిజ్రాల తీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని వారికి చెప్పారు. భక్తులను బెదిరింపులకు పాల్పడినా, ఇబ్బందులకు గురిచేసినా ఆధారాలతో సహా నిరూపించి ఇకపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

కలెక్టర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నాయకులు

రుద్రంగి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన దినోత్సవంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను జిల్లా కలెక్టర్ సందీప్‌కూమార్ ఝా ప్రొటోకాల్ పాటించకుండా అవమానించిన సంఘటనపై కాంగ్రెస్ పార్టీ ఓబిసి మండల అధ్యక్షుడు గండి నారాయణ ఆధ్వర్యంలో రుద్రంగి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాస్‌కు కలెక్టర్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బిసి బిడ్డ అయినందువల్లనే అవమానించారని, వెంటనే జిల్లా కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉన్నతాధికారులరు కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, మాజి జడ్పిటిసి గట్ల మీనయ్య, ఎర్రం గంగనర్సయ్య, కెసిరెడ్డి నార్సరెడ్డి, ఎర్రం రాజలింగం, కోమిరె శంకర్, ఇప్ప మహేష్, ఎర్రం అరవింద్, గంగాధర్ పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలతో అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చందుర్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని టీమ్ ఇన్‌చార్జి ఆర్ఎస్సై ప్రమీల అన్నారు. చందుర్తి మండలం జోగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సిరిసిల్ల షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బాలికలు మోసపోయే అవకాశాలను సోదాహరణంగా వివరించారు. ఎలాంటి సమస్య వచ్చినా షీ టీమ్‌ను సంప్రదించాలన్నారు. బాలురు మద్యం, మత్తు పదార్థాలు ఇతర హానికర అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ రాజు, ఎపిపిసి చైర్ పర్సన్ లావణ్య, ఉపాధ్యాయులు మహేష్, జావీద్, గోవర్ధన్, శ్రీనివాస్, పద్మ, నర్సయ్య, అంజయ్యలతో పాటు షీటీమ్ సభ్యులు, వీరయ్య, శ్రీనివాస్, శ్రీలత పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చూసే కాంగ్రెస్‌లో చేరికలు

కోనరావుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జననేత, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేసే అభివృద్ధి పనులు చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కాంగ్రెస్ నేత కోనరావుపేట ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీనరసింహారావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలు సరైనవి కావని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ఉద్యమకారులను విస్మరించిందని అందుకే కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. జనం వెంట ఉంటున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేస్తున్న పనులను చూసి ప్రతి ఒక్కరూ కాంగ్రెస్‌లో చేరాల్సిందేనని అన్నారు. ఈ సమావేశంలో కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, జిల్లా నాయకుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, నాలుక సత్యం, వెంగలి వెంకన్న, గొట్టే రుక్మిణి, బొర్ర రవీందర్, లింబయ్య తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కోనరావుపేటలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

కోనరావుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ విజయ దశమికి దేశ సేవలో ఆర్‌ఎస్‌ఎస్ 100 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా కోనరావుపేట మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా ప్రాంత సహ సద్భావన ప్రాముఖ్ గోనె భూమయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి సభ్యత్వ నమోదు, ఐడి కార్డు లేకుండా, ఒక సంస్థను 100 ఏండ్లు దిగ్విజయంగా నడపడం అంటే మాటలు కాదు. దాదాపు 85 లక్షల మంది స్వయం సేవకులు 40 లక్షల సంఘస్థాన్ శాఖలు నడుపుతూ ఎటువంటి అంతర్గత కలహాలకు తావు లేకుండా కొనసాగుతుందన్నారు. రాబోయే అక్టోబర్ నెలలో ఇంటింటా జన జాగరణ, హిందూ సమ్మేళనాలు ఘనంగా నిర్వహించబోతున్నామని తెలిపారు. నగర సహ శారీరక్ ప్రముఖ్ బొల్లు మల్లేశం, ఉప మండల ప్రముఖ్ భారత్ శర్మ, శాఖ కర్యవహ కస్తూరి రాజేందర్ ఉన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట ఆందోళన

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): పింఛను పెంచాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డిపేట మండలం దుమాల, అక్కపల్లి గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట వికలాంగుల పోరాట హక్కుల సమితి ఆధ్వర్యంలోని వికలాంగులు శనివారం ఆందోళన చేపట్టారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, వికలాంగుల పోరాట హక్కుల సమితి నాయకులు లక్ష్మణ్, గోపి, సంజీవ్, మల్లయ్య, లక్ష్మీనర్సయ్య, రాములు, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి

కోనరావుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు పోషకాహారం అందించాలని బీజేపీ నాయకులు సుదరగోని సాయికృష్ణ గౌడ్ అన్నారు. కోనరావుపేట మండలం రామన్నపేట గ్రామంలోని అంగన్వాడి సెంటర్‌లో పిల్లల తల్లిదండ్రులతో వంటల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషక విలువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్, గీత, బీజేపీ నాయకులు శ్రీహరిరెడ్డి తదితరులు ఉన్నారు.